# చిత్రమైన బోరీ

— అవసరాల రామకృష్ణారావు

రాంబాబు ఫోన్‌లో చెప్పిన సమాచారం అరాయించుకోలేక గోపీనాథ్‌కి మతిపోయినట్టయింది. బాస్ కాళ్లావేళ్లా పడి ఎలాగో ఆ పూట లీవు సంపాదించాడు. స్కూటర్ తీసుకుని యమా స్పీడులో చెల్లెలింటికి బయల్దేరాడు. ఎల్లకాలం వెర్రిబాగులదాన్లా వుండిపోవాలని నిశ్చయించుకున్న చెల్లెలు రమని తనెలాగా బాగుచెయ్యలేకపోయాడు. బతకనేర్వడం, పైకి రావడమేగాక సుఖపడడమెలాగో తెలిసిన రాంబాబు అయినా రమ బుర్రలో కొత్త ఇంటెలిజెన్స్ ఇంజెక్ట్ చెయ్యగలడేమో అని ఆశించాడు. స్కూటర్ స్పీడుతో పోటీ పడుతూ అతని ఆలోచనలు ఇంకా ఇంకా వెళ్లజొచ్చాయి.

రమలో వుండే ఆ అవలక్షణం ఇక ఈ జన్మకి పోదన్నమాట. ఎన్ని వందలసార్లు తను మొత్తుకోలేదు. అది విని ఛస్తేనా! అది పోస్టుమేనుకానీ, పనిమనిషి కానీ, పనివాడుకానీ, పక్కింటి మునలమ్మకానీ ఎదురుగా రెండు చెవులు కనపడితే చాలు- మనసులో వున్నదంతా ఒక్కముక్క మిగలకుండా ఒంపేసుకోకుండా ఎలావుండగలగడమో రమ నోటికి ఇక బోధపడే అవకాశం లేదుకాబోలు! పెద్ద గొంతుకపెట్టి గోడమీంచి పక్కింటి పిన్నిగారితో మాటాడుతూ "మరీ మెరిసిపోతున్నాయని ఇవేం రోల్డుగోల్డు గాజులనుకున్నార్థా, అచ్చ బంగారం సుమండీ, ఏదో బోనస్ దొరికిందిట - మా అన్నయ్య చేయించాడు" అన్న ప్రకటన చెవిన పడేకదూ దారేపోయే దొంగ ఒకడు ఆ రాత్రే కన్నం వేసి గాజులతో ఉడాయించింది. అంత జరిగాకేనా బుద్ధి రావాలా? ఏకంగా పది తులాల బంగారం, అందులో ఈ రోజుల్లో ఎవడో మోసగించి చేజిక్కించుకున్నాడని రాంబాబు ఫోన్ చేశాడివాళ. ఇంతటి వివేకమాదామణి అయిన పెళ్లాన్ని కట్టుకుని ఇంట్లో ఫోను పెట్టించుకున్న ఆ మొగుడికుండాలి బుద్ధి. ఆ వాగుడుకాయ ఎప్పుడూ ఫోన్ దగ్గిరే అఘోరిస్తూ వుండి వుంటుంది. 'దానికీ శిక్ష పడవలసిందే' అని చేతకాని కోపంతో చెల్లెల్ని తిట్టుకుంటూ వాళ్లిల్లు చేరాడు గోపీనాథరావు.

అన్నయ్యని అల్లుకుని గొల్లుమంటున్న పెళ్లాన్ని ఊరుకోబెట్టి లోపలికి పంపించి, జరిగింది వివరించాడు రాంబాబు.

ఎవడో దొంగరాస్కెల్ ఆ వీధికి చివరగా వున్న వాళ్లింటినీ, ఆఫీసుకి తన రాకపోకల్నీ, తమ ఆంతరంగిక రహస్యాలతో సహా స్టడీచేసి ఈ ప్లాను వేసి వుండాలి. అందుకే ఇంత చల్లగా జయప్రదంగా నిర్వహించి వుండాలి.

ఆరోజు పదకొండుగంటలకి రమకి ఫోనులో కబురు వచ్చిందట-

"నేనూ రాంబాబుని మాటాడుతున్నాను. ఎప్పట్లా గోల చెయ్యననీ కంగారుపడననీ ఒట్టుపెట్టుకుంటేనే నీకిది చెప్పేది"

"అబ్బా, ఏం జరిగిందోనని చెమటలుకమ్మి ఇప్పటికే చస్తున్నాను. మరేం ప్రమాదం జరగలేదుకదా... తొందరగా చెప్పండీ బాబూ..."

"అదిగో, ఆ పెద్ద గొంతుకే వద్దన్నాను. నువ్వు ఫోనులో మాట్లాడినా ఊరంతా వినపడిపోతే ఎలా? అందుకే నీకేం చెప్పడానికీ భయంగా వుంది"

"ఇలాంటి కబుర్లన్నీ ఎప్పుడూ వున్నవే కద... మీ గొంతుక ఎంచేతో మామూలుగా లేదు. నాకేదో కంగారుగా వుంది మా అన్నయ్యని పిలుస్తానండీ..."

"ఓసి నీ దుంపతెగ... ప్రతీ చిన్నదానికీ అలా హడావిడి చేసిపారేస్తావనేగా అతనూ గోలపెట్టేది. నాకవసరం అనిపిస్తే నేనే నేరుగా అతన్ని కేకెయ్యనా?"

"అన్నయ్యని కొత్తగా అతనూ అంటారు దేనికి? ఎంతో గౌరవంగా 'బావగారూ' అని ఉదహరించేవారే ఇదివరకు?"

"ఏం చెయ్యమన్నావ్, ఈ వార్త ఎలా చెరెయ్యడమా అని మాట తడబడుతోందోయ్"

'ఏమిటీ 'ఓయ్' అని పిలుస్తున్నారా నన్ను, ఇదెక్కడి కొత్త పిలుపండీ?"

"ఏం చెయ్యను, ఈ దెబ్బతో గుండె చెదిరిపోయిందనుకో"

"దెబ్బేమిటీ? ఏం కొంపమునిగిందో వెంటనే చెప్పి చెయ్యండీ బాబూ..."

"అలాగే... ఇంకలట్టే అడ్డురాక నన్ను పూర్తిగా చెప్పనియ్యి. ఏదో వాగేస్తున్నానుగాని డాక్టరు నన్నాట్టే మాట్లాడొద్దన్నాడు కూడా... మరేం లేదు, ఇవాళ నేను ఆఫీసుకి వస్తుంటే చిన్న యాక్సిడెంట్ అయింది. ఫ్రాక్చరయిందేమో అని హడలిపోయాను. మన అదృష్టం బాగుంది. ఇప్పుడు నేను అన్నపూర్ణా నర్సింగ్ హోమ్ నుంచి ఫోను చేస్తున్నాను. బాగా నెప్పిగా వుందిగాని ఈ ఒక్క రాత్రీ ఇక్కడుంటే చాలుట. రాత్రికి ఇంజక్షన్ ఇస్తానన్నాడు నెప్పి తగ్గడానికీ, నిద్ర పట్టడానికీ. ఈ నర్సింగ్ హోమ్ ఎక్కడుందో నీకు తెలుసుగా... ఇలాంటిది జరుగుతుందని నేనేం కలగన్నానా... ఏదో మామూలు ఖర్చుకని పర్సులో డబ్బు పెట్టుకున్నాను. నువ్వు వెంటనే ఇంట్లో మూడొందల చిల్లర వుందను కుంటాను పట్టుకురా"

"అయ్యో ఎంతపని జరిగిందండీ! నేనొక్కర్తినే రాలేక కాదుగాని మగసాయం వుంటే ఇంకా నయంగా? వుండండి మా అన్నయ్యకి ఫోను చేస్తాను"

"అదిగో అలాంటి పచ్చుపని చేస్తావనే ఇంతసేపూ ఎలాగో నేనే ఓర్చుకున్నాను. వద్దని ముందే ఒట్టు వేయించుకున్నాను గుర్తులేదూ? రాత్రి వుండిపోక తప్పదంటే ఫోన్ చేశాను. రెండో కంటివాడితో చెప్పకుండా ఫ్లాస్కూ, తలగడా పట్టుకుని వెంటనే వచ్చేస్తావా, నన్నే



11-5-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక

ఎలాగో అలా వచ్చెయ్యమన్నావా?''

తనలో తనే అంతటి ఆపదా ఆణగ్రదొక్కుకుని జీవితంలో మొదటిసారి రమ భర్త అడుగుజాడల్లో నడవడం బెడిసికొట్టింది! అలా ఫోను చేసింది రాంబాబు కానే కాదట! రాంబాబుకి అసలు యాక్సిడెంటే జరగ లేదట! అన్నపూర్ణా నర్సింగ్‌హోం నుంచి రాంబాబు ఆఫీసుకి వెడితే అతను అప్పుడే ఎక్కణ్ణుంచో వస్తూ పెళ్లాం చెప్పింది విని కంగారుపడి ఇద్దరూ ఇంటికి వచ్చి చూసేసరికి ఏముంది బీరువాలోని ఆమె నగల పెట్టె పూర్తిగా ఖాళీ! ఎవ్వాళ్టి కనిపెట్టాడో ఏ దొంగ వెధవ టోకరా వేశాడు! 'మీ చెల్లాయి నోట్లో నువ్వు గింజ నానదు. రహస్యమనీ, ఏకాంతమనీ ఇలాంటివి రమతో కుదరని విషయాలు బావగారూ! మా వీధి గుమ్మానికి ఎన్ని లివర్ల ఏ కంపెనీ తాళం ఎప్పుడు ఎంతకి కొన్నామో మొదలు మా గాద్రెజ్ తాళాలు ఎక్కడ పెట్టుకుంటామో వరకూ మా వీధిలో ప్రతి ఒకరికీ తెలుసు! బంగారం ఒకటే పోయింది గాని ఇల్లంతా కొల్లగొట్టలేదు సంతోషించండి. లోపం మన దగ్గిరుంచుకుని ఇంకా పోలీసు రిపోర్టు కూడా దేనికి, సిగ్గు సిగ్గు!' అంటూ ఆఫీసరెందుకో రమ్మన్నాడంటూ రాంబాబు వెళ్లిపోయాడు పెళ్లాన్నీ, అన్నగారినీ ఇంట్లో వదిలి.

'మనుషులు నేరాలెందుకు చేస్తారు?' అనే విషయం మీద గోపీనాథ్ సబ్మిట్ చేయబోయే థీసిస్ ఇంచు మించు పరిపక్వదశలో వుంది. ఇలాంటప్పుడు చెల్లెలింట్లో జరిగిన చోరీ అతనికో ఛాలెంజ్‌లా తోచింది. సునిశితమైన పరిశోధనా దృష్టి అతన్ని ఊరుకోనివ్వలేదు. ఈ టెలిఫోను సంభాషణ, ముఖ్యంగా అవతలి మనిషి గొంతుక గురించి మళ్లీ మళ్లీ చెల్లెల్ని ప్రశ్నించాడు.

"నువ్వడిగింది నిజమే. వారి స్వరం కాదేమో అని అప్పుడప్పుడు అనిపించకపోలేదు. గట్టిదెబ్బ తగిలి తడబడిందేమో నాలుక అని సర్దుకున్నాను. వారికి యాక్సిడెంటు అయిందని తెలీగానే నా బుర్ర అసలు ఆలోచించడం మానేసిందనుకో. ఇప్పుడాలోచిస్తే ఓ విషయంలో ఆ చెప్పింది వారు కాదని స్పష్టంగా తెలుస్తోంది."

"అదేమిటో తొందరగా చెప్పి తగలడు"

'మరేం లేదు. ఆయనో సెంటిమెంటు మనిషి. పీక తెగినా పుస్తెలతాడు తియ్యనివ్వరు. అసలు అదొక్కటే నాలుగు తులాలు వుంటుంది. ఇందాక చెప్పడం మరచిపోయాను. ప్రత్యేకించి హెచ్చరించాడు ఆ దగుల్బాజీ "ఒంటరిగా వస్తున్నావు. ఒంటిమీద ఏం బంగారం వుంచుకోకు. పుస్తెలతాడైనా సరే'' ఆ కంగారులో అదీ తీసి బీరువాలో దాచానుగానీ, అప్పుడైనా అనుమానించాను కాను" గొల్లుమంది రమ.

నిష్ఠూరమైన నిజం ఎదురుగా నిలిచినట్లై విషాదంగా నవ్వుకున్నాడు గోపీనాథ్.

వెర్రి రమకి వాళ్ల పెళ్ళికి ముందే తనకి బాగా ఫ్రెండయిన రాంబాబు గురించి ఏం తెలుసు! వాడికా సెంటిమెంటు! ఎన్నో రకం మజాలలో తామిద్దరూ తోడు దొంగలు. పెద్ద ఉద్యోగం కదా, పెళ్ళైతే బాగుపడతాడేమో అని ఆశించాడు. పెళ్లాం బాగు చేసుకొనేది అయితే మగాడికేం జబ్బా! కాని పెళ్ళై పదేళ్లయినా పైవాళ్లతో సొల్లు కబుర్లు తప్ప ఇంటి మగాడితో మంచీ చెడ్డా చర్చించే స్థాయికి పెళ్లాం ఎదగకపోతే ఆ మగాడు ఛస్తాడా? చిలక్కొట్లుకైనా ఎగబడతాడు, ఏదో విధంగా పెళ్లాం నగలకైనా ఎగనామం పెడతాడు! ●

## ప్రేమ-పెళ్ళి-విడాకులు

విశాఖపట్నంలో దింగిడీ బస అని ఒకటి వుంది. అంటే ఏమిటనుకున్నారు? అవివాహిత కన్యల కోసం ఏర్పాటు చేసిన వసతి గృహం అన్న మాట. దింగిడీ అంటే కన్య అని అర్థం. గిరిజన ప్రాంతంలో యుక్త వయస్కులైన కన్యలకు ఏ విధమైన నిబంధనలు, కట్టుబాట్లు వుండవు. సాయంత్రం అయ్యేసరికి గ్రామంలోని అమ్మాయిలంతా ఈ దింగిడీ బసకు చేరతారు. యువకులు, యువతులు కలిసి అన్ని క్రీడల్లో పాల్గొంటారు. ఎవరికి నచ్చినవారిని వారు ఎన్నుకుని పెద్దలకు చెబుతారు. వాళ్ళు ఒప్పుకోకపోతే ఆ ఇద్దరూ నిరభ్యంతరంగా దూర ప్రాంతానికి వెళ్ళిపోతారు. కొన్నాళ్ళయ్యాక మామగారికి కన్యాశుల్కం పంపిస్తాడు అల్లుడు. ఆ డబ్బుతో ఆయన గ్రాండ్‌గా అందరికీ విందు చేస్తాడు. అలాగే భర్తతో ఏ మాత్రం సరిపడకపోయినా ఆ మొగుడుకి విడాకులిచ్చేసి రెండవ భర్తని ఎన్నుకుంటుంది. విడాకులు ఎప్పుడూ భార్యే ముందు ఇస్తుంది.

—సేకరణ :- బొప్పలగడ్డ లలితాదేవి




ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక 11-5-90